# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



## విలేకరులు కావలెను

తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు
- RC ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు

-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.



సంచిక : 359 | సంపుటి : 2 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | సోమవారం | 17-2-2025 | వెల : .రూ. 5.00




# 20న ఢిల్లీ సీఎం ఖరారు...?

- నేడు జరగాల్సిన బీజేపీ శాసనసభా పక్ష సమావేశం వాయిదా
- 23తో ముగియనున్న ఢిల్లీ అసెంబ్లీ పదవీకాలం

న్యూఢిల్లీ (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

20న రాంలీలా మైదానంలో ఢిల్లీ కొత్త ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉన్నట్టు అధిష్టానం లీకులిస్తోంది.దీనిలో భాగంగా సోమవారం జరగాల్సిన శాసనసభా పక్ష సమావేశం వాయిదా పడినట్టు సమాచారం .అయితే ఈ సమావేశం 19న జరగనున్నది. మరుసటి రోజున కొత్త సీఎం ప్రమాణ స్వీకారం చేసేలా అధిష్టానం సూచనలు చేసినట్టు

-మిగతా 2 లో




## 'భూమిపైనే అత్యంత తెలివైన ఎఐ గ్రోక్ 3

- ఎలన్ మస్క్ కీలక ప్రకటన

న్యూయార్క్

ప్రపంచంలో ఉన్న టెక్ దిగ్గజాలన్నీ ఎఐ టెక్నాలజీ డెవలప్‌మెంట్ లో పోటీపడుతున్న నేపథ్యంలో ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ కీలక ప్రకటన చేశారు. మస్క్ నేతత్వంలోని కత్రిమ మేధ సంస్థ 'ఎక్స్‌ఏఐ' అత్యంత అధునాతనమైన గ్రోక్ 3 సేవలను అందుబాటులోకి తీసుకురానుందని సామాజిక మాధ్యమాల్లో

-మిగతా 2 లో



## వలసదారులకు తొలగని కష్టాలు

కాళ్లకు చైన్లు, చేతులకు సంకెళ్లు..

న్యూఢిల్లీ

సరైన పత్రాలు లేని వలసదారుల్ని స్వదేశం తిప్పి పంపు తున్న అమెరికా వారిపై అమానవీ యంగా ప్రవర్తించడం మానడం లేదు. ఎన్ని విమర్శలు, ఆందోళనలు వస్తున్నా అమెరికా ప్రభుత్వం మాత్రం వలస దారుల్ని సంకెళ్లతోనే బంధించి సైనిక విమానాల్లో తరలిస్తోంది. ఈ విషయాన్ని స్వదేశం చేరకున్న భారత వలస దారులు స్వయంగా తెలిపారు. 'డిపోర్టేషన్'లో భాగంగా 116 మంది భారతీ యులతో

-మిగతా 3 లో

# ఏసీ గదుల్లోంచి బయటకు రండి

## యువ ఐఏఎస్‌లకు సీఎం రేవంత్‌రెడ్డి చురకలు



- ప్రజలకు చేరువకావాలని దిశానిర్దేశం
- పేదలకు సాయం చేయాలనే ఆలోచన అధికారులకు ఉండాల
- సివిల్ సర్వెంట్స్ అందరికీ ఈ పుస్తకం ఒక దిక్సూచి
- 'లైఫ్ ఆఫ్ ఏ కర్మయోగి' పుస్తకావిష్కరణలో ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

"కొందరు యువ ఐఏఎస్‌లు ఏసీ గదుల్లోంచి బయటకు వచ్చేందుకు కూడా ఇష్టపడట్లేదు. తమవద్దకు వచ్చిన ఫైళ్లను ఏ కొర్రీపెట్టి నిలుపుదల చేయాలా అని ఆలోచిస్తున్నారే తప్ప, ప్రజాసంక్షేమం కోసం ఏం చేద్దాం అనే ఆలోచనలు తగ్గిపోతున్నాయి. కొందరు యువ ఐపీఎస్ అధికారులు శిక్షణ సమయంలోనే యూనిఫామ్ వేసుకొని, సివిల్ తగాదాల్లో తలదూర్చి, సెటిల్‌మెంట్లు చేస్తున్నారని ఆక్షేపించారు. ముఖ్యమంత్రి మొదలు ఇతర ప్రజాప్రతినిధులకు విధుల్లో దిశానిర్దేశం చేసేలా ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల పనితీరు ఉండాలి. రాజకీయ

-మిగతా 2 లో



## రాజీవ్‌గాంధీ హిందువే కాదు

కేంద్ర మంత్రి బండి సంజయ్

విద్యానగర్,

రాజీవ్ గాంధీ అసలు హిందువే కాదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదివారం కరీంనగర్‌లోని అంబేదర్ స్టేడియంలో స్వదేశీ జాగరణ మంచ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'స్వదేశీ మేళా' ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన బండి సంజయ్ మాట్లాడారు.రాజీవ్‌గాంధీ

-మిగతా 2 లో

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు ఖాయం

- బయ్యారం ఉక్కు నాసిరకం
- రిజర్వేషన్లకు బీజేపీ మద్దతు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

వరంగల్,(నీలగిరి ఎక్స్‌ప్రెస్)

మహబూబాబాద్ జిల్లా బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే నిధులు వృథా అవుతాయని, ఆ ప్రాంతంలో దొరికేది నాసిరకం ఖనిజమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం

-మిగతా 2 లో






## భూభారతి జిందాతిలిస్మాత్ లాంటిది

- కేసీఆర్ పర్సనల్ ఎజెండాతోనే ధరణి
- టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్

-హైదరాబాద్

భూ భారతి అన్ని సమస్యలకు జిందాతిలిస్మాత్ లాంటిదని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. కేసీఆర్ తన సొంత ఎజెండాతోనే ధరణిని తీసుకొచ్చారని విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లో తెలంగాణ రెవెన్యూ ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం, డైరీ, క్యాలెండర్-2025 ఆవిష్కరణ కార్యక్రమంలో

-మిగతా 2 లో

# కార్పొరేట్ల రుణ మాఫీ కోసమే కేంద్రం అప్పులు

- ప్రతి బడ్జెట్‌లోనూ తెలంగాణకు అన్యాయం
- తెలంగాణలో మేం ప్రజల దశాబ్దాల కష్టాలు తీర్చాం
- రాష్ట్ర దశను మార్చి తరగని ఆస్తులు సృష్టించాం :
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు కేటీఆర్ లేఖ



(నీలగిరి ఎక్స్‌ప్రెస్) -హైదరాబాద్

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్పొరేట్ల రుణాల మాఫీ కోసమే అప్పులు చేస్తున్నట్టుగా ఉందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ మంత్రి కే.తారకరామారావు ఆరోపించారు. ప్రతి బడ్జెట్‌లోనూ తెలంగాణకు అన్యాయం చేస్తున్న తీరును ఎత్తిచూపారు. తెలంగాణలో పదేండ్ల కాలంలో ప్రజల దశాబ్దాలుగా కష్టాలు తీర్చామనీ, అప్పులు చేసినప్పటికీ తెలంగాణకు తరగని ఆస్తులను సృష్టించామని వివరించారు. తెలంగాణకు కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపులను పెంచాలని డిమాండ్ చేశారు. ఈ మేరక ఆదివారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్‌కు లేఖ రాశారు. దేశచరిత్రలోనే అత్యధికంగా

-మిగతా 2 లో

# ఏసీ గదుల్లోంచి బయటకు రండి

(మొదటి తరువాయి)



ప్రాపకం కోసం నేతలు ఏం చెప్తే, దానికి తలాడించే పరిస్థితుల్లో మార్పు రావాలి. రిటైర్డ్ అయిన సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఆ దిశగా కొత్తగా వచ్చేవారికి దిశానిర్దేశం చేయాలి. దానికోసం ప్రభుత్వ ఆధ్వర్యంలోనే సెమినార్లు, చర్చాగోష్టులు నిర్వహించాలి" అని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి చెప్పారు. ఐఏఎస్ రిటైర్డ్ సీనియర్ అధికారి ఎమ్ గోపాలకృష్ణనాయుడు తన 60 ఏండ్ల అనుభవాలను అక్షరబద్ధం చేస్తూ 'లైఫ్ ఆఫ్ ఏ కర్మయోగి' పేరుతో పుస్తకాన్ని రచించారు. హైదరాబాద్ బేగంపేటలోని ఐఏఎస్ ఆఫీసర్స్ ఇనిస్టిట్యూట్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి ఈ పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. సివిల్ సర్వెంట్స్ అందరికీ ఈ పుస్తకం ఒక దిక్సూచిగా ఉంటుందని అన్నారు. ఆనాటి తొలి ప్రధాని నెహ్రూ నుంచి ఈనాటి వరకు దేశంలో వేగంగా జరిగిన మార్పులకు గోపాలకృష్ణనాయుడు ప్రత్యక్ష సాక్షి అని చెప్పారు. ఐఏఎస్‌లు అనగానే ఎస్ఆర్ శంకరన్, టీఎన్ శేషన్, మన్మోహన్‌సింగ్ వంటి నిబద్ధత కలిగిన ఉద్దండులు గుర్తొస్తారని అన్నారు. వారు తమకు అప్పగించిన బాధ్యతల్ని సక్రమంగా నిర్వర్తించి, ప్రజల హృదయాల్లో స్థానాన్ని పదిలం చేసుకున్నారని కొనియాడారు. అలాంటివారి అనుభవాల నుంచి నేటి సివిల్ సర్వెంట్స్ ఎంతో నేర్చుకోవాల్సి ఉందన్నారు. గతంలో రాజకీయ నాయకులు అంశాలను ప్రస్తావిస్తే దానిలోని లోతుపాతులు, లాభనష్టాలను ఐఏఎస్‌లు వివరించేవారనీ, కానీ ఈ రోజుల్లో ఎందుకో అది తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ నిర్ణయాలపై నాయకులకు అధికారులు విశ్లేషణ చేసి చెప్పాలని అభిప్రాయపడ్డారు. గతంలో ఐఏఎస్ అధికారులు నిత్యం ప్రజల్లో ఉండేవారనీ, రాజకీయ నాయకుల కంటే ప్రజలు అధికారులనే ఎక్కువగా గుర్తుంచుకునేవారని చెప్పారు. కానీ ఇప్పుడు కలెక్టర్లు ఏసీ రూముల్లోంచే బయటకు వెళ్లడం లేదనీ, వారి ఆలోచనలు, విధానాల్లో మార్పు రావాలని కోరారు. నిబద్ధత కలిగిన అధికారులకు తప్పకుండా గుర్తింపు ఉంటుందనీ, పేదలకు సాయం చేయాలనే ఆలోచన అధికారులకు ఉండాలని చెప్పారు. ఆ దిశగా రాష్ట్రంలోని అధికారులు పాలనపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధ్యక్షత వహించారు. ఆర్థిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, పుస్తక రచయిత ఎమ్ గోపాలకృష్ణనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు ఖాయం

(మొదటి తరువాయి)

హనుమకొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. 14 నెలల కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుండటంతో ప్రజల దృష్టి మళ్లించేందుకే ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వంపై సీఎం రేవంత్ విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలో ఏ సీఎం కూడా ప్రతివారం ఢిల్లీ చుట్టూ తిరుగలేదని ఎద్దేవా చేశారు. రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై బీజేపీ పోరాటాలు చేస్తుందని చెప్పారు. రాష్ట్రంలో కుల గణన సర్వేను ఏ ఒక్క బీసీ సంఘం అంగీకరించడం లేదన్నారు. బీసీ రిజర్వేషన్లకు బీజేపీ మద్దతు ఇస్తుందని, బీసీ సంఘాలు సమర్థిస్తే కుల గణనను కేంద్రం ఆమోదించేలా చేస్తామని హామీ ఇచ్చారు. వంద రోజుల్లో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీ ఇప్పటి వరకు ఒక్క కొత్త ఉద్యోగాన్ని కూడా భర్తీ చేయలేదని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌ల ద్వారా వచ్చిన ఉద్యోగాలను మాత్రమే కాంగ్రెస్ ప్రభుత్వం భర్తీ చేసిందని చెప్పారు. త్వరలోనే బీజేపీ కొత్త అధ్యక్షుడి నియమాకం జరుగుతుందని తెలిపారు

# కార్పొరేట్ల రుణ మాఫీ కోసమే కేంద్రం అప్పులు

(మొదటి తరువాయి)



అప్పులు చేసిన బీజేపీ పాలకులు తమపై అబాండాలు మోపడం దుర్మార్గమని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చిననాటి నుంచి 14 మంది ప్రధానులు 65 ఏండ్లలో 56 లక్షల కోట్ల అప్పులు చేస్తే..పదేండ్లలో మోడీ సర్కారు రూ.125 లక్షల కోట్ల అప్పు చేసిందని విమర్శించారు. ఆ అప్పులతో ఏంచేశారనేది ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలన తరువాత కూడా తెలంగాణను మిగులు బడ్జెట్ రాష్ట్రంగానే కాంగ్రెస్‌కు అప్పజెప్పామని కేటీఆర్ తేల్చిచెప్పారు. అసలు అప్పులను, మిగులు బడ్జెట్‌తో ముడిపెట్టడం సమంజసం కాదని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన అప్పుతో దశాబ్దాలపాటు ఈ నేలను పట్టి పీడించిన తాగు, సాగునీటి కష్టాలను శాశ్వతంగా నిర్మూలించే ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను నిర్మించామని వివరించారు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను వెన్నాడిన విద్యుత్ సమస్యను పారదోలేందుకు భారీ ప్లాంట్ల నిర్మాణానికి, మరోవైపు రాష్ట్రంలో ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాల కల్పనకు ఈ నిధులను ఉపయోగించిన విషయం తెలంగాణ సమాజానికి తెలుసని తెలిపారు. ఎఫ్ఆర్‌బీఎం పరిమితికి లోబడి చేసిన అప్పును తప్పుగా చూపించే ప్రయత్నాన్ని తీవ్రంగా ఖండించారు. అటు కేంద్ర బడ్జెట్‌లోనూ, ఇటు రైల్వే కేటాయింపుల్లో మోడీ సర్కారు తెలంగాణపై వివక్ష చూపిందని విమర్శించారు. అధికారంలోకి రాగానే తెలంగాణలోని ఏడుమండలాలను, లోయర్ సీలేరు విద్యుత్ ప్రాజెక్టును లాక్కొని కొత్తగా ఏర్పడిన రాష్ట్రం గొంతుకోసిన విషయాన్ని తెలంగాణ సమాజం మరిచిపోలేదని గుర్తుచేశారు. విభజన హక్కులను నెరవేర్చాలని అడిగితే కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్ తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడటం దారుణమని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో పసుపు బోర్డుకు ఒక్క పైసా కూడా కేటాయించకుండా మాటలకే పరిమితం కావడమేంటని ప్రశ్నించారు. ఐటీఐఆర్ ప్రాజెక్టును పునరుద్ధరించాలని పదేండ్లలో పదులసార్లు మొరపెట్టుకున్నా కేంద్రం వినిపించుకోలేదని ఎత్తిచూపారు. పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీలను విస్మరించడం మోసంకాదా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సొంత ఖర్చులతో చేపట్టిన మిషన్ భగీరథ ద్వారా వంద శాతం ఇండ్లకు తాగునీళ్లు ఇచ్చిన రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దితే, జల్ జీవన్ మిషన్ కింద 38 లక్షల నల్లా కనెక్షన్లు ఇచ్చామని కేంద్రం తన ఖాతాలో వేసుకోవడం దుర్మార్గమని విమర్శించారు. ఆదిలాబాద్ జిల్లాలో మూతపడ్డ సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను తెరిపించి యువతకు ఉపాధి కల్పించాలని పదేపదే విజ్ఞప్తిచేసినా కేంద్రం వినిపించుకోకపోవడం ఆ ప్రాంత ప్రజలపట్ల బీజేపీకి ఉన్న నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని తెలిపారు. బీజేపీ నుంచి ఎనిమిది మంది ఎంపీలను గెలిపించినా ఎనిమిది పైసలు కూడా తీసుకురాలేని అసమర్థతను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు.

# భూభారతి జిందాతిలిస్మాత్ లాంటిది

(మొదటి తరువాయి)




పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరణి వల్ల రైతులు చాలా ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. కేసీఆర్ రాష్ట్ర ప్రజలను మోసం చేసినట్టే రెవెన్యూ ఉద్యోగులను కూడా మోసం చేశారని తెలిపారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారనీ, ఖజానా అంతా ఖాళీ చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. రెవెన్యూ ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతగా ఉందని చెప్పారు. భూ సమస్యలన్నీ భూ భారతితోనే పరిష్కారమవుతాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మెన్, డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షులు లచ్చిరెడ్డి, తెలంగాణ రెవెన్యూ ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు డాక్టర్ కొనగాల మహేష్, టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షులు బాణాల రామ్‌రెడ్డి, తెలంగాణ తాహసీల్దార్ల అసోసియేషన్ రాష్ట్ర మహిళా అధ్యక్షులు రాధ, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పాక రమేష్, టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్రే బిక్షం తదితరులు పాల్గొన్నారు

# 20న ఢిల్లీ సీఎం ఖరారు...?

(మొదటి తరువాయి)

పార్టీ వర్గాలు తెలిపాయి.

శాసనసభా పక్ష నాయకుడిని ఎన్నుకోవచ్చు

ఢిల్లీలోని బీజేపీ ఎమ్మెల్యేలు, ఏడుగురు ఎంపీలు ఈ సమావేశంలో శాసనసభా పక్ష నాయకుడిని ఎన్నుకునే అవకాశం ఉంది. సమావేశ అనంతరం బీజేపీ శాసనసభా పక్ష నాయకుడు, పార్టీ నాయకులతో కలిసి లెఫ్టినెంట్ గవర్నర్‌ను కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటానికి మెజార్టీ సభ్యుల సంతకాలతో కూడిన పత్రాన్ని సమర్పించనున్నట్టు పేర్కొంటున్నారు.

## ఈ పేర్లపై ఊహాగానాలు

తమ ఎన్నికల వ్యూహంలో భాగంగా ముఖ్యమంత్రి అభ్యర్థిని బీజేపీ ప్రకటించలేదు. ప్రధాని మోడీ విదేశీ పర్యటన నుంచి తిరిగి వచ్చేశారు.సీఎం రేసులో ఎమ్మెల్యేలు విజేంద్ర గుప్తా, ప్రవేశ్ వర్మ, రేఖ గుప్తా, సతీష్ ఉపాధ్యారు, ఆశిష్ సూద్, పవన్ శర్మ, అజరు మహావర్ తదితరుల పేర్లు తెరపైకి వచ్చాయి. ముఖ్యమంత్రి, సహాయక మంత్రుల ఎంపికలో బీజేపీ తుది నిర్ణయం తీసుకుంటుందని కమలం పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

## ఎంపీలకూ ఛాన్స్

పార్టీలోనే మింగుడుపడని విధంగా బీజేపీ హైకమాండ్ నిర్ణయాలు ఉంటాయని ప్రచారం. ఫలానా వారు సీఎం అనుకుంటే..మధ్యలో మరొకరి తెరపైకి తెస్తున్న ఘటనలు చాలానే ఉన్నాయి. అయితే ఏ ఎంపీనైనా ముఖ్యమంత్రిని చేయగలదనే సంకేతాలిస్తున్నారు.. ఈ విషయంలో కేంద్ర సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రా, బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు , ఈశాన్య ఢిల్లీ ప్రాంతానికి చెందిన ఎంపీ మనోజ్ తివారీ, న్యూఢిల్లీ ఎంపీ బన్సూరి స్వరాజ్ పేర్లూ వినిపిస్తున్నాయి.ఢిల్లీ అసెంబ్లీ పదవీకాలం ఫిబ్రవరి 23తో ముగియ నుంది, కాబట్టి ప్రమాణ స్వీకార కార్యక్రమం అంతకు ముందే జరిగే అవకాశం ఉంది.

# 'భూమిపైనే అత్యంత తెలివైన ఎఐ గ్రోక్ 3

(మొదటి తరువాయి)

ప్రకటించారు. భూమిపైన అత్యంత తెలివైన ఎఐ సాధనంగా దీన్ని ఆయన అభివర్ణించారు. భారత కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 9 గంటల 30 నిముషాలకు ఈ కొత్త మోడల్ అందుబాటులోకి రానుందని తెలిపారు. ఇప్పటికే గ్రోక్ చాట్‌బాట్ సేవలు విస్తతంగా ప్రాచుర్యం పొందాయి. చాట్ జిపిటికి పోటీగా మార్కెట్లోకి వచ్చిన గ్రోక్, మెరుగైన ఫీచర్లతో వినియోగదారులను ఆకట్టుకుంది. తాజాగా 'ఎక్స్' వేదికగా గ్రోక్ 3 విడుదల కానున్నట్లు మస్క్ ప్రకటించారు. అయితే.. దీని సామర్థ్యాలకు సంబంధించిన పూర్తి వివరాలను మాత్రం వెల్లడించలేదు. టెక్ నిపుణుల అభిప్రాయానుసారం%ొ% ఈ కొత్త మోడల్ టెక్స్ట్-టు-వీడియో వంటి అధునాతన ఫీచర్లను కలిగి ఉండే అవకాశముంది. ఈ అప్‌గ్రేడ్‌తో, గ్రోక్ 3 ఓపెన్‌ఏఐ తీసుకొచ్చిన జిపిటి-4, గూగుల్ జెమిని వంటి ఏఐ మోడళ్లకు ప్రధాన పోటీదారుగా నిలవనుంది. ప్రస్తుతం కత్రిమ మేధ విభాగంలో పోటీ తీవ్రంగా పెరిగింది. ఓవైపు ఓపెన్‌ఏఐ తన చాట్‌జీపీటీ మోడళ్లను నిరంతరం అభివద్ధి చేస్తుండగా, గూగుల్ జెమినీని మరింత మెరుగుపరుస్తోంది. మెటా తన ఎల్‌ఎల్‌ఎఎంఎ సిరీస్‌ను విస్తరిస్తోంది. ఈ నేపథ్యంలో, ఎలాన్ మస్క్ గ్రోక్ 3ను ప్రవేశపెట్టడం టెక్ ప్రపంచంలో కీలక పరిణామంగా నిలిచింది.

# వలసదారులకు తొలగని కష్టాలు

(మొదటి తరువాయి)

కూడిన రెండో విమానం శనివారం రాత్రి అమృత్‌సర్‌కు చేరుకున్న సంగతి తెలిసిందే. ఇందులో హౌషియార్‌పుర్ జిల్లా కురలా కలాన్‌కు చెందిన దిల్జిత్ సింగ్ అనే వ్యక్తి.. అమెరికా ప్రయాణం గురించి మీడియాతో మాట్లాడాడు. తిరిగి వచ్చే సమయంలో అమెరికా అధికారులు వ్యవహరించిన తీరును వివరించాడు. కాళ్లకు చైన్లు, చేతులకు సంకెళ్లు వేశారని తెలిపారు. విమానం అమృత్‌సర్‌లో ల్యాండ్ అయ్యే ముందు సంకెళ్లను తొలగించారని అని దిల్జిత్ సింగ్ పేర్కొన్నారు. మహిళలకు మాత్రం సంకెళ్లు వేయలేదని తెలిపారు. ఈ నెల 5న మొదటిగా వచ్చిన విమానంలోనూ 104 మంది వలస దారులకు చేతికి సంకెళు గొలుసులతో బంధించి తీసుకొచ్చారు. దీనిపై తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చినా అమెరికా వెనక్కి తగ్గలేదు. అమెరికా నుంచి శనివారం వచ్చిన సి-17విమానంలో 116మంది వలసదారుల్లో 65మంది పంజాబ్‌కు చెందినవారు, 33మంది హర్యానాకు చెందినవారు, ఎనిమిది మంది గుజరాత్‌కు చెందినవారు, ఉత్తరప్రదేశ్, గోవా, మహారాష్ట్ర, రాజస్థాన్‌కు చెందిన ఇద్దరు చొప్పున, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్‌కు చెందిన వారు ఒక్కొక్కరు ఉన్నారని అధికారులు తెలిపారు. పంజాబ్‌కు చెందిన వారిని ఇమ్మిగ్రేషన్, నేపథ్య తనిఖీల తర్వాత పోలీసు వాహనాల్లో వారి ఇళ్లకు తరలించారు. హర్యానా ప్రభుత్వం తమ రాష్ట్రం చెందిన వారికి రవాణా ఏర్పాట్లు కూడా చేసింది.

# రాజీవ్‌గాంధీ హిందువే కాదు

(మొదటి తరువాయి)



హిందువు అయినందున ఆయన కుమారుడు రాహుల్‌గాంధీ కూడా హిందువేనని కాంగ్రెస్ నేతలు చెప్పడం విడ్డూరమన్నారు. రాజీవ్‌గాంధీ తండ్రి ఫిరోజ్ జహంగీర్‌ఖాన్ పార్సీ, ఆయన మతమే రాజీవ్‌గాంధీకి వర్తించినప్పుడు హిందువు ఎలా అవుతారని ప్రశ్నించారు. బీసీ కులగణన పేరుతో హిందువులకు అన్యాయం జరుగుతున్నదని తెలిపారు. 10% ముస్లింలకు కేటాయించి, 42% బీసీలకు రిజర్వేషన్లు ఎట్లా ఇస్తారో చెప్పాలని నిలదీశారు. బీసీ జాబితా లో నుంచి ముస్లింలను తీసేసి కేంద్రానికి పంపిస్తే ఆమోదం పొందేలా చేస్తామన్నారు.

## తెలుగు పంచాంగం 17/2/2025,సోమవారం

సమయ సమాచారం:
సూర్యోదయం: ఉదయం 6:45
సూర్యాస్తమయం: సాయంత్రం 6:14
తిథి:
కృష్ణ పక్ష పంచమి – ఫిబ్రవరి 17 ఉదయం 2:16 నుండి ఫిబ్రవరి 18 ఉదయం 4:53 వరకు
నక్షత్రం:
చిత్త– ఫిబ్రవరి 17 ఉదయం 4:31 నుండి ఫిబ్రవరి 18 ఉదయం 7:35 వరకు
శుభ సమయాలు:
అమృతకాలం: రాత్రి 12:22 నుండి 2:10 వరకు
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 12:07 నుండి 12:53 వరకు
అశుభ సమయాలు:
రాహుకాలం: ఉదయం 8:11 నుండి 9:37 వరకు
యమగండం: ఉదయం 11:04 నుండి మధ్యాహ్నం 12:30 వరకు
దుర్ముహూర్తం: మధ్యాహ్నం 12:53 నుండి 1:38 వరకు, మధ్యాహ్నం 3:10 నుండి 3:56 వరకు
వర్జ్యం: మధ్యాహ్నం 1:32 నుండి 3:20 వరకు
పండితుల సూచన:
సోమవారం రోజున శివపూజ చేయడం శ్రేయస్కరం. శివాభిషేకం, శివ స్తోత్రాలు పఠించడం ద్వారా శాంతి, సౌభాగ్యం పొందవచ్చు.

## వాసవి దేవాలయంలో సంకటహర చతుర్థి ప్రత్యేక పూజలు



**షాద్ నగర్,ఫిబ్రవరి 16(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** సంకష్ట హర చతుర్థి సందర్భంగా వాసవి కన్యాకాపరమేశ్వరి దేవాలయం లో పాల్గొన ఆర్యవైశ్య సంఘం మరియు అనుబంధ సంఘాల అధ్యక్షులు కార్యవర్గం మరియు మిత్రులు పాల్గొని కార్యక్రమం ను విజయవంతం చేయడం జరిగింది.

## హాస్టళ్లలో ఆహార నాణ్యత పై అధికారుల తీవ్ర నిర్లక్ష్యం



**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ (టీఎస్ఎస్ఓ) రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ రాజేంద్రనగర్ గిరిజన బాలుర హాస్టల్ సందర్శించి, విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు లక్ష్మీనివాసుకు చేసిన ఫిర్యాదులో, వారి ఆసుపత్రిలో నాణ్యతా సాంప్రదాయాలకు తగ్గట్టుగా ఆహారం అందించట్లేదని, నెలల తరబడి ఈ సమస్యను అధికారులకు తెలుపినా పట్టించుకోవట్లేదని వివరించారు. ఈ సందర్భంగా లక్ష్మీనివాస్ మాట్లాడుతూ, "తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా హాస్టల్లో విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడం కుదరటం లేదని తెలిపారు. హాస్టల్ భోజనం నాణ్యతగా ఉండే విధంగా సంబంధిత శాఖ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలి" అని డిమాండ్ చేశారు. వాటితో పాటు, హాస్టల్ అధికారులపై విజిలెన్స్ కమిటీ ఏర్పాటు చేసి, రాష్ట్రంలోని అన్ని హాస్టల్లో తనిఖీ చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఎస్ఓ నాయకులు రఘు ముదిరాజ్, సుధాకర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## వనపర్తిలోపలు వివాహాలకు హాజరైనమాజీ మంత్రి



**వనపర్తి, ఫిబ్రవరి 16(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** వనపర్తి కళ్యాణ్ సాయి గార్డెన్స్ లో కొండ గోపాల్ రెడ్డి, నిర్మలమ్మ ల కూతురు స్వరూపరెడ్డి కి సంతోష్ రెడ్డితో వివాహము జరిగింది ఈ వివాహ వేడుకకు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించి, వారి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆర్ జి గార్డెన్ లో అపర్ణ రెడ్డి రాకేష్ రెడ్డి ల వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా ఆయన వెంటగట్టు యాదవ్ వాకిటి శ్రీధర్ చిట్యాల రాము. తదితరులు పాల్గొన్నారు.

# ఆమనగల్లు లయన్స్ క్లబ్‌కు అవార్డుల పంట




**ఆమనగల్లు, ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రీజియన్ పరిధిలో అత్యుత్తమ క్లబ్‌గా లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఘన విజయాన్ని సాధించింది. తేజా కన్వెన్షన్ హాల్, నాగర్ కర్నూల్‌లో రీజియన్ చైర్ పర్సన్ లయన్ డాక్టర్ తెప్ప శ్రీను ఆధ్వర్యంలో జరిగిన లయన్స్ క్లబ్ రీజియన్ మీట్ సమావేశంలో ఈ అవార్డులను ప్రకటించారు. ఆమనగల్లు లయన్స్ క్లబ్ పి వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం, 2024–2025 సంవత్సరానికి గాను చేసిన సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా క్లబ్‌కు 33 అవార్డులు లభించాయి. రక్తదాన శిబిరాలు, కంటి వైద్య శిబిరాలు, మెగా హెల్త్ క్యాంపులు, మధుమేహ పరీక్షల శిబిరాలు, మీల్స్ అండ్ వీల్స్ ఉచిత అన్న ప్రసాదాల కార్యక్రమాలు, క్యాలెండర్ ఆఫ్ ఈవెంట్స్, పాఠశాలలో మౌలిక వసతులు కల్పించడం, పర్మినెంట్ ప్రాజెక్టులు, వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలకు ఈ అవార్డులు లభించాయి. ఈ సంవత్సరానికి అత్యుత్తమ అధ్యక్షుడిగా పసుల లక్ష్మారెడ్డి, ఉత్తమ కార్యదర్శిగా దోనాదుల మహేష్, ఉత్తమ కోశాధికారిగా గుజ్జరి నరసింహ, అత్యుత్తమ పిఆర్‌ఓగా ఎం.ఏ. పాషా అవార్డులను అందుకున్నారు. క్లబ్ సాధించిన ఈ విజయానికి సహకరించిన మల్టిపుల్ ఏరియా లీడర్ లయన్ సందడి నరేందర్ రెడ్డి, మల్టిపుల్ కోఆర్డినేటర్ లయన్ జి. చెన్న కిషన్ రెడ్డి, మాజీ గవర్నర్లు జూలూరి రమేష్ బాబు, ఎస్. రాధాకృష్ణ, రామ్ రెడ్డి, లయన్స్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ వి. దామోదర్ రెడ్డి, జోన్ చైర్ పర్సన్ సంపతి జనార్దన్ రెడ్డికి క్లబ్ సభ్యులు మరియు జిల్లా చైర్మన్‌లకు క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి, పి.ఆర్.ఓ ఎం.ఏ. పాషా అభినందనలు తెలిపారు.

# రైతు, ప్రజా వ్యతిరేఖ విధానాలను అవలంభిస్తున్న కాంగ్రెస్ పార్టీకి స్థానిక ఎన్నికల్లో బుద్ధి చెప్పండి



**అమనగల్లు, ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రైతు, ప్రజా వ్యతిరేఖ విధానాలను అవలంభిస్తున్న కాంగ్రెస్ పార్టీకి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ ఈ నెల 18న కల్వకుర్తి నియోజకవర్గంలోని అమనగల్లు మున్సిపాలిటీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించనున్న రైతు నిరసన దీక్షకు బీఆర్ఎస్ పార్టీ కార్యానిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ రానున్నారు అని తెలిపారు. మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, ఆదివారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఉప్పల వెంకటేష్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేష్, మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్, మరియు ఇతర స్థానిక నాయకులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా, లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రైతులను, అన్ని వర్గాల ప్రజలను, నిరుద్యోగులను మోసం చేస్తుందని ఆరోపించారు. "మాటల గారిడి, అబద్దాల హామీలతో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలను హామీలను నేరవేర్చడంలో పూర్తిగా విఫలం చెందారు. బీఆర్ఎస్ హయంలో రైతులను ఆదుకునేందుకు కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లోనూ రైతు బంధు డబ్బులను వారి ఖాతాల్లో జమ చేసిన ఘనత కేసీఆర్ కే దక్కిందని అన్నారు. రైతులు వ్యవసాయం చేసుకుంటున్న భూములను రోడ్ల పేరుతో, ట్రిపుల్ ఆర్, గ్రీన్ ఫీల్డ్ రోడ్డు, కంపెనీల పేరుతో భూములు లాక్కోవడం దారుణం. రైతులు వ్యవసాయం చేసుకుంటున్న రెండెకరాలు, మూడు ఎకరాలను తీసుకుంటే రైతులు ఎలా బతకాలని" ఆయన ప్రశ్నించారు. 'రైతులకు బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా ఉంటూ న్యాయం జరిగే వరకు రైతుల పక్షాన పోరాటం చేస్తుంది. రైతుల సమస్యలపైన ఎక్కడ సమావేశం పెట్టిన రైతులు తండోపతండాలుగా తరలివస్తున్నారు" అని గుర్తుచేశారు. రైతు నిరసన దీక్షకు నియోజకవర్గంలోని రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్, మాజీ జడ్పీటీసీ నర్సింహ్మా, మాజీ ఎంపీపీ నిర్మల శ్రీశైలం గౌడ్, సీనియర్ నాయకులు శ్రీనునాయక్, జోతయ్య, గంప శ్రీను, గుత్తి బాలస్వామి, ఎనుమల్ల రమేష్, చలీచీమల సతీష్, సైదుల్ గౌడ్, నాగిల్ల జగన్, వెంకటేష్, యాదయ్య, శేఖర్, దేవేందర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడితో తెలంగాణ లెక్చరర్స్ ఫోరమ్ నాయకుల సమావేశం



**హైదరాబాద్, ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి గంగాపురం కిషన్ రెడ్డితో తెలంగాణ లెక్చరర్స్ ఫోరమ్ (టీఎల్ఎఫ్) నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా, వరంగల్, ఖమ్మం, నల్గొండ, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాల టీచర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులకు మద్దతు తెలిపినట్లు తెలిపారు. సమావేశంలో, రాష్ట్రంలోని కళాశాలలు మరియు పాఠశాలల టీచర్ల సమస్యలను టీఎల్ఎఫ్ నాయకులు కిషన్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా, కిషన్ రెడ్డి మాట్లాడుతూ, "ఉపాధ్యాయుల సమస్యల పట్ల భారతీయ జనతా పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని" అన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని టీఎల్ఎఫ్ నాయకులను కోరారు. తెలంగాణ ఉద్యమం నుండి కూడా క్రమశిక్షణ ఉన్నటువంటి సంస్థ టీఎల్ఎఫ్ అని, తెలంగాణ వచ్చినప్పటి నుండి ఇప్పటివరకు సమస్యలు తీరలేదని టీఎల్ఎఫ్ నాయకులు అన్నారు. మా సమస్యలను బీజేపీ పరిష్కరిస్తుందని, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హామీ ఇచ్చారు. గతంలో కూడా టీఎల్ఎఫ్ కి అనేక సందర్భాల్లో బీజేపీ అండగా నిలిచిందని టీఎల్ఎఫ్ నాయకులు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా నిలిచి, వారి గెలుపు కోసం కృషి చేస్తామని టీఎల్ఎఫ్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎల్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ యూ. సిద్దేశ్వర్, డాక్టర్ యాదయ్య నెల్లి, శ్రీవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఖబరస్థాన్‌లో లైట్లు ప్రారంభం



**కల్వకుర్తి, ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కల్వకుర్తి పట్టణ పరిధిలోని మున్సిపల్ ఆఫీస్ వెనుక ఖబరస్థాన్‌లో లైట్లు ఏర్పాటు చేశారు. ఈ లైట్ల ఏర్పాటుకు కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ కృషి చేయగా, స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారం అందించారు. మొత్తం రూ. 3,50,000 విలువైన ఈ లైట్లను కల్వకుర్తి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సిమ్ముల శ్రీకాంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గోరేటి శ్రీనివాసులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమాకాంత్ రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కుడుముల చంద్రకాంత్ రెడ్డి, నాయకులు సోఫీ ఆరిఫ్, పడకంటి వెంకటేష్, దున్న సురేష్, నవీన్, ముస్లిం మైనార్టీ నాయకులు సలాం, సుబ్బు, అబ్బు, చోటు, మోహిజ్, అజార్, ఇంజస్, సోహెల్ తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటుదాం - పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

-గ్రీన్ ఇండియా చాలెంజ్ వృక్షార్చన కార్యక్రమంలో మేము సైతం అన్న దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్



**దేవరకొండ, ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గ్రీన్ ఇండియా చాలెంజ్ వృక్షార్చన కార్యక్రమంలో భాగంగా, బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు మరియు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ మాట్లాడుతూ, "మొక్కలు నాటుదాం - పర్యావరణాన్ని పరిరక్షిద్దాం" అని అన్నారు. ఆదివారం, దేవరకొండ పట్టణంలో, తెలంగాణ జాతిపిత మరియు అభివృద్ధి ప్రదాత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 17న, గ్రీన్ ఇండియా చాలెంజ్ రూపకర్త జోగినపల్లి సంతోష్ కుమార్ పిలుపుమేరకు మొక్కలు నాటే వృక్షార్చన కార్యక్రమ పోస్టర్లను రమావత్ రవీంద్ర కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా, రవీంద్ర కుమార్ మాట్లాడుతూ, "తెలంగాణ అభివృద్ధి కోసం నిరంతరం పరితపించే నాయకుడు కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా దేశవ్యాప్తంగా వృక్షార్చన కార్యక్రమం చేపట్టడం చాలా సంతోషంగా ఉంది" అని తెలిపారు.

## ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షుడు డా. జి. సంజీవ రెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎంగలి ప్రసాద్




**హైదరాబాద్, ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షుడు డా. జి. సంజీవ రెడ్డి జన్మదిన వేడుకలు హైదరాబాద్‌లోని ఆర్టీసీ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మాజీ ఎంపీ హనుమంతరావు, వేతన కార్మిక శాఖ ఛైర్మన్ జనక్ ప్రసాద్ హాజరయ్యారు. ఐఎన్‌టియుసి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎంగలి ప్రసాద్ తదితరులు డా. జి. సంజీవ రెడ్డిని కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టియుసి రాష్ట్ర మరియు జిల్లా నాయకులు బంగారి పర్వతాలు, సాయిబాబు, మాధవరెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా జాబ్ మేళ

హాజరు కానున్న సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి




**కల్వకుర్తి, ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నేడు కల్వకుర్తి పట్టణంలో మహిళా జాబ్ మేళ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్నారు. ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ మరియు టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. కార్యక్రమం హైదరాబాద్ రోడ్డులోని ఐక్యత ఫౌండేషన్ కార్యాలయంలో ఉదయం 10:00 గంటలకు ప్రారంభమవుతుంది అని ఐక్యత ఫౌండేషన్ వర్గాలు తెలిపాయి.

## కొండా వారి పెళ్లికి హాజరైన చిన్నారెడ్డి

**వనపర్తి, ఫిబ్రవరి 16(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**



వనపర్తి కళ్యాణ్ సాయి గార్డెన్స్ లో కొండ గోపాల్ రెడ్డి, నిర్మలమ్మ ల కూతురు స్వరూపరెడ్డి కి సంతోష్ రెడ్డితో వివాహము జరిగింది ఈ వివాహ వేడుకకు తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించి, వారి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వనపర్తిలో పలు వివాహాలకుహాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శు భాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా ఆయనవెంట కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొత్తూరు నిలవర్ధన్ రెడ్డి, సాయి కిరణ్, శ్యామ్ సుందర్ రెడ్డి, వనపర్తి మండల కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులున్నారు.

# కె.సి.ఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించాలి

-మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి




**వనపర్తి,ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తెలంగాణ రాష్ట్ర సాధకులు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కె.సి.ఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించాలని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి పిలుపునిచ్చారు.ఒక్కడిగా బయలు దేరి శూన్యంలో సునామీ సృష్టించి తెలంగాణ రాష్ట్రం సాధించిన మాజీ ముఖ్యమంత్రి కె.సి.ఆర్ ఎడారిని తలపించిన తెలంగాణ రాష్ట్రాన్ని పచ్చని పంట పొ లాలుగా మార్చిన కె.సి.ఆర్ కృషిని గుర్తుచేసే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలని నిరంజన్ రెడ్డి ఈ సందర్భంగా జిల్లా,పట్టణ,మండల,గ్రామ అధ్యక్షులు,నాయకులు,కార్యకర్తలు ప్రతి పట్టణ, మండల, గ్రామాలలో వృక్షార్చాన చేపట్టి విరివిగా మొక్కలు నాటి మరో హరితహారానికి శ్రీకారం చుట్టాలని,,సేవా కార్యక్రమాలు రక్తదాన శిబిరాలు,అన్నప్రసాద వితరణ,దేవాలయాలలో,చర్చి,మసీదుల్లో ప్రార్ధనలు చేపట్టాలని నిరంజన్ రెడ్డి పిలుపునిచ్చారు.

## పాఠకులకు గమనిక:




**మీరు ఎదుర్కొంటున్న సమస్యలను వివరణాత్మకంగా మాకు తెలియజేయండి. ప్రభుత్వ అధికారుల మరియు ప్రజల మధ్య వారధిగా నిలిచి, మా ప్రత్యేక విలేకరుల బృందం సంబంధిత అధికారులను సంప్రదించి, పరిష్కారం కోసం కృషి చేస్తుంది.**
**మమ్మల్ని సంప్రదించడానికి:**
**ఇమెయిల్:** neelagiriexpress@gmail.com
**సంప్రదింపు నెంబర్: 9705770909**
**మీ ప్రతిభావంతమైన భాగస్వామ్యంతో సమాజానికి మంచి మార్పు తీసుకురావడం మా లక్ష్యం.**
మీ గొంతుకకు మేమే వేదిక - నీలగిరి ఎక్స్‌ప్రెస్!

# ప్రాణాపాయ స్థితిలో ఉన్న గర్భిణీ స్త్రీ కి రక్తదానం చేసిన వనపర్తి జిల్లా యువశక్తి ఫౌండేషన్

-బ్లడ్ బ్యాంక్ లో బ్లడ్ లేకపోవడంతో ఆందోళనలో కుటుంబ సభ్యులు
-రక్తదానం -ప్రాణదామే యువశక్తి ఫౌండేషన్ అధ్యక్షులు కాగితాల మధు




**వనపర్తి, ఫిబ్రవరి 16(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
ప్రాణాపాయ స్థితిలో ఉన్న గర్భిణీ స్త్రీకి సకాలంలో రక్తదానం చేశామని రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్టే అని వనపర్తి జిల్లా యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కాగితాల మధు తెలిపారు. వివరాల్లోకి వెళితే వనపర్తి జిల్లా గాంధీనగర్ కాలానికి చెందిన మల్లిక డెలివరీ కోసం జిల్లా ఏరియా హాస్పిటల్ లో అడ్మిట్ అవ్వడం జరిగింది. రక్తహీనత కారణంగా ఆమెకు బ్లడ్ తక్కువగా ఉంది.వెంటనే ఏ పాజిటివ్ బ్లడ్ ఎక్కించాలి లేకపోతే ఆమె ప్రాణాలకు ప్రమాదం అని డాక్టర్స్ చెప్పడంతో బ్లడ్ కోసం అన్ని బ్లడ్ బ్యాంకు లలో ఎంత ఎంత వెతికిన లేకపోవడంతో కుటుంబ సభ్యులు స్థానికుల సమాచారం మేరకు కుటుంబ సభ్యులు యువశక్తి ఫౌండేషన్ ని ఆశ్రయించడంతో స్పందించిన యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కాగితాల మధు వెంటనే జిల్లా కేంద్రానికి చెందిన సంతోష్ కు సమాచారం ఇవ్వడంతో మానవత్వ హృదయంతోజిల్లా కేంద్రంలో ఉన్న న్యూ లైఫ్ బ్లడ్ బ్యాంకు లో నిండు గర్భిణీకి రక్త దానం చేశారు.ఈ కార్యక్రమం లో యువశక్తి ఫౌండేషన్ మెంబెర్ రక్తధాత సంతోష్,కుటుంబ సభ్యులు, ల్యాబ్ టెక్నిసియన్స్ పాల్గొన్నారు

## శ్రీ శ్రీ శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం




**షాద్ నగర్, ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
శ్రీ శ్రీ శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం రామేశ్వరం (రాయికల్) లో శివరాత్రి సందర్భంగా జరగబోయే బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డిలకు ఆహ్వాన పత్రికను దేవాలయ ఈవో శివకుమార్ మరియు దేవాలయ ధర్మకర్త ప్రహ్లాద చార్యులు అందజేశారు. రామేశ్వరం శివరాత్రి నాడు జరిగే బ్రహ్మోత్సవాలు జాతరకు ఆహ్వాన పత్రికను అందజేసి, ఎమ్మెల్యే శంకర్ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంపత్ కుమార్, మాజీ ఎంపిటిసి అరుణ వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మోహన్ రెడ్డి, ఆశన్న గౌడ్, కిట్టు పంతులు, శ్రీకాంత్ రెడ్డి, బాలరాజు, బ్యాటరీ కృష్ణారెడ్డి, హైదర్ గోరి తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ పుట్టినరోజు పురస్కరించుకొని సేవా కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చిన రజినీ సాయిచంద్



**హైదరాబాద్, ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టినరోజును పురస్కరించుకొని, ఆయన తనయుడు కేటీఆర్ సేవా కార్యక్రమాలు, సామాజిక కార్యక్రమాలు, మరియు ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలని కార్యకర్తలకు, అభిమానులకు పిలుపునిచ్చారు. కేటీఆర్ పిలుపు మేరకు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కేసీఆర్ పుట్టినరోజున చేపట్టిన కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా పండగ వాతావరణం నెలకొల్పుతున్నాయి. మాజీ వేర్‌హౌస్ కార్పొరేషన్ చైర్మన్ రజిని సాయిచందు, కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటే "వృక్షార్చన" కార్యక్రమంలో పాల్గొని, కేసీఆర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా, రజిని సాయిచందు మాట్లాడుతూ, "కార్యకర్తలు, అభిమానులు ఇలాంటి కార్యక్రమాలను కొనసాగించాలి" అని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్ రావు, ఇతర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన వంశీచందర్ రెడ్డి దంపతులు



**మాడుగుల, ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మాడుగుల మండల పరిధిలోని ఆవురుపల్లి గ్రామానికి చెందిన రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంతరెడ్డి కూతురు విజయ శ్రీ వివాహ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్ల వంశీచందర్ రెడ్డి మరియు అశ్లేష రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. స్పోర్ట్స్ పార్టీ చైర్మన్ శివసేన రెడ్డి, పీసీసీ సభ్యులు ఆయిల్లా శ్రీనివాస్ గౌడ్, ఆమనగల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజీమ్, డీసీసీ కార్యదర్శి రవీందర్ యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి డిగ్రీ కృష్ణ, మైనార్టీ మండల అధ్యక్షుడు అరిఫ్ తదితరులు కూడా ఈ వివాహ వేడుకలో పాల్గొన్నారు.

# తెలంగాణలో కొత్తగా డబుల్ రోడ్లు...

-మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు రోడ్లు.
-ఈ ప్రాంతాల్లోనే,ఇక దూసుకెళ్లిపోవచ్చు..!
-ప్రణాళికలు సిద్ధం చేస్తున్న రాష్ట్ర సర్కార్.
-కేంద్రం సహకారంతో జాతీయ రహదారుల విస్తరణకు చర్యలు.



**రంగారెడ్డి,ఫిబ్రవరి 16(నీలగిరి ఎక్స్ ప్రెస్):** తెలంగాణలో కొత్త రహదారుల నిర్మాణానికి రాష్ట్ర సర్కార్ సిద్ధమైంది.మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు పలు చోట్ల సింగల్ రోడ్ల మాత్రమే అందుబాటులో ఉన్నాయి.ఈ నేపథ్యంలో ప్రజా రవాణాకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.దీంతో ఆయా మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు రోడ్లు నిర్మించాలని డిసైడ్ అయ్యారు.ఈ రోడ్లు అందుబాటులోకి వస్తే ఆ ప్రాంతాల రూపు రేఖలు మారిపోనున్నాయి.

**తెలంగాణ డబుల్ రోడ్లు..**

తెలంగాణలో రోడ్లు అభివృద్ధికి సర్కార్ పెద్దపీట వేస్తోన్న సంగతి తెలిసిందే. కేంద్రం సహకారంతో పలు జాతీయ రహదారుల విస్తరణకు చర్యలు తీసుకుంటుంది.తాజాగా రాష్ట్ర రహదారులపై కూడా ఫోకస్ పెట్టింది.ప్రస్తుతం రాష్ట్రంలో 4 లైన్ హైవేలు 1,151 కి.మీ., రెండు వరుసల (డబుల్ రోడ్లు) రహదారులు 12,836 కి.మీ., ఒక వరుస రహదారులు 16,013 కి.మీ. మేర అందుబాటులో ఉన్నాయి. అయితే ప్రతి మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి కొత్తగా రెండు వరుసల రోడ్లు నిర్మించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది...ప్రస్తుతం కొన్ని మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు 898 కిలోమీటర్ల మేర సింగిల్ రోడ్లు ఉండగా.. వాటిని డబుల్ రోడ్లుగా మార్చాలని రోడ్లు,భవనాల శాఖ నిర్ణయం తీసుకుంది.తెలంగాణ ఆవిర్భావం,కొత్త జిల్లాలు ఏర్పాటు తర్వాత జిల్లా,మండల కేంద్రాలకు మధ్య దూరం చాలా వరకు తగ్గింది.ఈ నేపథ్యంలో ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల్లో వివిధ రకాల పనులు,వ్యాపారాలు,విద్యార్థుల చదువుల నిమిత్తం జిల్లా కేంద్రాలకు మండల కేంద్రాలతో పాటు వాటి పరిధిలోని గ్రామాల నుంచి రాకపోకలు ఎక్కువయ్యాయి.ప్రధానంగా 10 వేల నుంచి 25 వేల వరకు జనాభా ఉన్న మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు రాకపోకలు ఎక్కువగా ఉంటున్నాయి.అయితే చాలా మండలాల్లో సింగిల్ రోడ్లు ఉండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది.ఈ నేపథ్యంలో మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు డబుల్ రోడ్లు నిర్మించాలని సర్కార్ భావిస్తోంది.వచ్చే నాలుగేళ్లలో వీటిని నిర్మించేందుకు ప్రణాళికలు రచిస్తోంది.

**ఈ ప్రాంతాల్లోనే ఎక్కువ...!**

ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలోని దేవరకొండ నియోజకవర్గంలో 21.40 కి.మీ.,ఆలేరులో 22.20 కి.మీ., భువనగిరిలో 20.90 కి.మీ. మేర నిర్మించనున్నారు.ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని నారాయణఖేడ్‌లో 35.80 కి.మీ.,దుబ్బాకలో 50.86 కి.మీ.,నర్సాపూర్‌లో 39.00 కి.మీ.నిర్మించనున్నారు.ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని అచ్చంపేటలో 54.40 కి.మీ.,గద్వాలలో 27.30 కి.మీ., అలంపూర్‌లో 36.80 కి.మీ.నిర్మించనున్నారు.

**ఈ జిల్లాలో ఎక్కువ..!**

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోని వికారాబాద్‌లో 38 కి.మీ.,పరిగిలో 22 కి.మీ మేర నిర్మించనున్నారు.ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ఎల్లారెడ్డిలో 13.81 కి.మీ.,కామారెడ్డిలో 6.76 కి.మీ.మేర ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 88 కి.మీ.,ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పెద్దపల్లిలో 52.73 కి.మీ.,వేములవాడలో 44.80 కి.మీ.,ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ములుగులో 37.75 కి.మీ.మేర డబుల్ రోడ్లు నిర్మించనున్నారు కాగా,డబుల్ రోడ్ల నిర్మాణం పూర్తయితే..ఆ ప్రాంతాల రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి.దీంతో మరోసారి తెలంగాణ లో భూముల ధరలకు కూడా రెక్కలు రానున్నాయి...

# చెట్టు = అమ్మ
# చెత్త = రోగం

చెట్టు మన జీవితానికి అమ్మంత ప్రాముఖ్యమైనది. అది మనకు ప్రాణవాయువును అందిస్తుంది, ప్రకృతిని సంరక్షిస్తుంది, మన శ్రేయస్సుకు తోడ్పడుతుంది. చెట్టు ఉంటే జీవితం ఉందని చెప్పడం అసత్యం కాదు. మరోవైపు, చెత్త అనేది రోగాలకు కారణమవుతుంది. చెత్త ఎక్కడైతే పేరుకుపోతుందో అక్కడ పర్యావరణం కలుషితమవుతుంది, నీరు, గాలి, నేల నాశనం అవుతాయి.

**చెట్టు ఎలా అమ్మలా ఉంటుంది:**

-మనకు ఆక్సిజన్ అందిస్తుంది.
-నీడ, చల్లదనం, ఆహారం, చెక్క, ఔషధాలు అందిస్తుంది.
-ప్రకృతి మనుగడలో కీలక పాత్ర పోషిస్తుంది.

**చెత్త ఎలా రోగంగా మారుతుంది:**

-చెత్త పేరుకుపోతే దోమలు, చీమలు, బ్యాక్టీరియా పుట్టుక.
-కాలుష్యం వల్ల శ్వాసకోశ, నీరు మరియు ఆహారానికి సంబంధించిన రోగాలు.

చెట్టు మన జీవితానికి అమ్మవంటిది. అందుకే మనం చెట్లను నాటాలి, వాటిని కాపాడాలి.
చెత్త మన జీవనానికి రోగం. అందుకే చెత్తను తగ్గించాలి, పునర్వినియోగం చేయాలి, పర్యావరణాన్ని స్వచ్ఛంగా ఉంచాలి.

"ప్రకృతిని ప్రేమిద్దాం, జీవనాన్ని కాపాడుకుందాం!"
మీ నరేష్ దండు సామాజిక కార్యకర్త

# వెల్దండలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం



**వెల్దండ, ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** వెల్దండ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కల్వకుర్తి మాజీ శాసనసభ్యులు జైపాల్ యాదవ్ హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా, జైపాల్ యాదవ్ మాట్లాడుతూ, ఈనెల 18న ఆమనగల్లో నిర్వహించనున్న రైతు నిరసన దీక్ష కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రానున్నారని, ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీల హామీల అమల్లో ప్రభుత్వం విఫలమైందని, ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గరలో ఉన్నాయని, హామీలను అమలు చేయకుండా ప్రతిపక్ష నాయకులను ఇబ్బందులు పెడుతున్నారని ఎద్దేవా చేశారు. ఈనెల 18న ఆమనగల్లో నిర్వహించనున్న రైతు దీక్షకు కేటీఆర్ హాజరుకానున్నారని తెలిపారు.
ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ పుట్టరామ్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ వెంకటయ్య గౌడ్, మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ జంగిలి నిరంజన్, సింగల్ విండో డైరెక్టర్ శేఖర్ ముదిరాజ్, చంద్రమోహన్ రెడ్డి, మాజీ రైతు సమన్వయ అధ్యక్షులు భాస్కరరావు, మాజీ సర్పంచ్ వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ హనుమంతు నాయక్, లింగం ముదిరాజ్, తిరుమలరావు, అంజయ్య, అంజి నాయక్, బాల లక్ష్మయ్య, రాములు, పర్వతాలు, సోమయ్య, యువనాయకులు జంగిలి ఆనంద్, పోలే అశోక్, మధుసూదన్ రెడ్డి, పిల్లి దేవేందర్, గండికోట రాజు, పూరి రమేష్, శీను ముదిరాజ్, రమేష్ గౌడ్, శేఖర్, వెంకట్, మలికేడి కొండల్, శ్రీనివాస్ రెడ్డి, తిరుపతిరెడ్డి, నాగయ్య, జంగిలి ప్రవీణ్, జంగిలి రవి, జగన్, ఈదులపల్లి శ్రీనివాస్, లాలయ్య, సత్యం, ప్రభాకర్, సక్రు నాయక్, జంగయ్య, రాములు, హనుమంతు నాయక్, జోగు రవికుమార్, మరియు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# మంగలి మురళి కూతురు వివాహానికి హాజరైన ఠాకూర్ బాలాజీ సింగ్



**కల్వకుర్తి, ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కల్వకుర్తి పట్టణ పరిధిలోని కేసీఆర్ ఫంక్షన్ హాల్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారి మంగలి మురళి కూతురు వివాహ వేడుకలు ఘనంగా జరిపారు. ఈ వివాహానికి తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, రాష్ట్ర పీసీసీ అధికార ప్రతినిధి మరియు రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సభ్యుడు ఠాగూర్ బాలాజీ సింగ్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అదేవిధంగా, మంగలి మురళి ఆరోగ్య పరిస్థితిపై ఆయన అడిగి తెలుసుకున్నారు. ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా పాల్గొన్నారు.

# శ్రీ అంబ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఎంపీ మల్లు రవికి ఆహ్వానం



**వెల్దండ, ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** వంగూరు మండల కేంద్రంలోని నీ గుండాల గ్రామంలో శ్రీ అంబ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఈనెల 25 నుండి శివరాత్రి బ్రహ్మోత్సవాల వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ వేడుకల్లో పాల్గొనాల్సిందిగా ప్రజలను ఆహ్వానించారు. వెల్దండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మరియు జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ సభ్యులు ఎం మోతిలాల్ నాయక్, కిసాన్ సెల్ తాలూకా అధ్యక్షుడు పర్వత్ రెడ్డితో కలిసి, దేవాలయ కమిటీ చైర్మన్ మల్లేపల్లి సందీప్ రెడ్డిని ఆదివారం కలవడం జరిగింది. నాగర్ కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవిని అర్చకుల మంత్రోచ్ఛారణలతో సన్మానించి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి తక్కెళ్ళపల్లి శేఖర్, సేవా దళ్ జిల్లా ఉపాధ్యక్షుడు కొయ్యల పుల్లయ్య, కమిటీ జిల్లా సభ్యులు కొమ్ము అంజయ్య, అర్చకులు నరహరి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# వివిధ వివాహాలు, శుభకార్యాలలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి





**షాద్ నగర్, ఫిబ్రవరి 16(నీలగిరి ఎక్స్ ప్రెస్)** షాద్నగర్ పట్టణంలో, పరిగి, గాలిగూడెం, కొందుర్గు, అప్పారెడ్డిగూడ, కేశంపేటలో జరిగిన వివిధ వివాహ మహోత్సవాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి గారు, వారితోపాటు సీనియర్ నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, మోహన్ సింగ్, కొందుర్గు, కొత్తూరు, చౌదరిగూడ మండలాల అధ్యక్షులు చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి, అత్తాపూర్ మహేందర్ రెడ్డి, ఎదిరరాజు, నాయకులు, శ్రీశైలం, బాల్ రెడ్డి, బోయ అశోక్, అనీల్, మల్లేష్ , సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## పోటి పరీక్షలపై అవగాహన సదస్సు




**కల్వకుర్తి, ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కల్వకుర్తి పట్టణంలోని కేఐపీ ఇన్స్టిట్యూషన్ డైరెక్టర్ నవీన్ కుమార్ ఆధ్వర్యంలో, గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద విద్యార్థులకు పోటీ పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు సాధన స్టడీ హాల్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ఎస్.అర్ శంకరన్ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ సతీష్ కుమార్, వేణు సార్, సీనియర్ హిస్టరీ ఫ్యాకల్టీ సదానందం గౌడ్, మరియు రాజేందర్ పాల్గొన్నారు. సతీష్ కుమార్ మాట్లాడుతూ, "ఎస్.ఆర్ శంకరన్ ఐఏఎస్ స్ఫూర్తితో ఏర్పాటు చేసిన ఈ అకాడమీ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పేద విద్యార్థులను సివిల్ సర్వీస్ పరీక్షలకు సన్నద్ధం చేసే లక్ష్యంతో కృషి చేస్తోంది. పట్టుదలతో, శ్రద్ధతో చదివి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని" అన్నారు. కల్వకుర్తి పట్టణంలో మరిన్ని సదస్సులు నిర్వహించి, సివిల్ సర్వీసెస్ పరీక్షలపై పూర్తి అవగాహన కల్పించేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న శ్రీనివాస్, నాగరాజు, హాజీ పాషా, యాదగిరి గౌడ్, శ్రీశైలం, రవికుమార్ తో పాటు సుమారు 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## మాడుగులలో కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు

**మాడుగుల, ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మాడుగుల మండల పరిధిలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కేటీఆర్ పిలుపు మేరకు టిఆర్ఎస్ నాయకుడు,కబ్య తండ గ్రామపంచాయితీ మాజీ ఉప సర్పంచ్ కుబ్య నాయక్ ప్రజలకు ఈ విషయాన్ని తెలియజేశారు.
ఈ సేవా కార్యక్రమాలలో రక్తదాన శిబిరాలు నిర్వహించడం, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం, మరియు సామాజిక కార్యక్రమాలు చేపట్టడం అని తెలిపారు.

## పలు వివాహాలకు హాజరైన రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు కేవీఎన్ రెడ్డి



**వంగూరు, ఫిబ్రవరి 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వంగూరు మండల కేంద్రంలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో వడ్డెర అనిల్ మరియు వాసు తమ్ముడు శేఖర్ వివాహ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం పద్మావతి గార్డెన్ మరియు వైబీ ఫంక్షన్ హాల్ లలో జరిగినది. ఈ వివాహ వేడుకల్లో రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు కె.వి.ఎన్.రెడ్డి, వేమారెడ్డి కృష్ణారెడ్డి, సంతోష్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, చందు, శివకుమార్, పర్వతాలు, క్యామ మల్లేష్, రంగాపూర్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులను ఆశిర్వదించిన బిజెపి పార్టీ నాగర్ కర్నూల్ జిల్లా కౌన్సిల్ సభ్యులు సింగం శ్రీనయ్య



**ఆమనగల్,ఫిబ్రవరి 16(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఆమనగల్ మండలం గౌరారం గ్రామానికి చెందిన గంగ మహేష్ గౌడ్ - మాధవి ల కుమారుడు, కుమార్తెల నూతన పట్టువస్త్రాలంకరణ మహోత్సవ కార్యక్రమం అమనగల్ మండలం గౌరారం గ్రామంలో ఎస్ఎస్బి, ఫంక్షన్ హాల్లో కన్నుల పండుగల జరిగింది. ఈ కార్యక్రమానికి ఆదివారం బిజెపి పార్టీ నాగర్ కర్నూల్ జిల్లా కౌన్సిల్ సభ్యులు సింగం శ్రీనయ్య, జిల్లా నాయకులు, చిటుగోరి సీతారాం రావు, వి. వీరేష్ గౌడ్, మాజీ ఉప సర్పంచ్ కృష్ణయ్య, గ్రామ పెద్దలు హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో గంగ పద్మ - రామచంద్రయ్య గౌడ్, శ్రీను, తిరుపతి గౌడ్, మరుపకుల కృష్ణ, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి భక్తులతో హోరెత్తనున్న పెద్దగట్టు లింగమంతుల స్వామి జాతర

**సూర్యాపేట, ఫిబ్రవరి 16(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తెలంగాణలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించబడే పెద్దగట్టు లింగమంతుల స్వామి జాతర రేపటి నుండి ఘనంగా ప్రారంభం కానుంది. సూర్యాపేట జిల్లా, చివేమ్ల మండలం, పెద్దగట్టులో జరిగే ఈ జాతరలో 30 లక్షలకుపైగా భక్తులు పాల్గొననున్నారని అంచనా. సమ్మక్క-సారలమ్మ జాతర తరువాత తెలంగాణలో అత్యంత ప్రాచుర్యం పొందిన ఈ ఉత్సవానికి రాష్ట్రం నలుమూలలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తున్నారు.

**పరమభక్తితో పాదయాత్రలు**
జాతరను పురస్కరించుకుని భక్తులు ఇప్పటికే పెద్ద సంఖ్యలో పాదయాత్రలు ప్రారంభించారు. లింగమంతుల స్వామి (శివుడు) కొలువై ఉన్న కొండపైకి ఎక్కి మొక్కులు తీర్చుకోవడం, ప్రత్యేక పూజలు చేయడం ప్రధాన విశేషంగా ఉంటాయి. ఆలయ పరిసర ప్రాంతాల్లో పలహార బండ్లు, అన్నదానం, ఊరేగింపులు భక్తులను ఆకట్టుకోనున్నాయి.

**భద్రతా ఏర్పాట్లు పూర్తి**
భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పోలీసు, వైద్య, అగ్నిమాపక శాఖలు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశాయి. ట్రాఫిక్ నియంత్రణ, మెడికల్ క్యాంపులు, అత్యవసర సేవలు సిద్ధంగా ఉంచారు. భక్తులు ఎలాంటి ఇబ్బంది లేకుండా సీసీ కెమెరాలు, పోలీసు విభాగాల ప్రత్యేక బృందాలు నిఘా ఉంచనున్నాయి.

**ఆకర్షణీయంగా సాంస్కృతిక కార్యక్రమాలు**
జాతర సందర్భంగా హరికథలు, భజనలు, ఒగ్గు కథలు, సంప్రదాయ నృత్యాలు భక్తులను భక్తి భావంలో ముంచెత్తనున్నాయి. ఆలయ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమాలు భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించనున్నాయి.

**భక్తులకు విజ్ఞప్తి** జాతరలో పాల్గొనే భక్తులు పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత పాటించాల్సిన అవసరం ఉందని నిర్వాహకులు విజ్ఞప్తి చేస్తున్నారు. సహనంతో వ్యవహరించి, భక్తి భావంతో జాతరను నిర్వహించేందుకు సహకరించాలని ఆలయ అధికారులు కోరుతున్నారు. రేపటి నుంచి పెద్దగట్టు లింగమంతుల స్వామి జాతర భక్తజన సందోహంతో హోరెత్తనుంది. ఆధ్యాత్మికత, భక్తి శ్రద్ధ, ఆచారాల సమ్మేళనంగా ఈ పవిత్ర ఉత్సవం నిర్వహించబడనుంది.

# పేరు మార్చుకోవడం ప్రాథమిక హక్కు

**-అలహాబాద్ హైకోర్టు కీలక తీర్పు**



**అలహాబాద్(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పేరు ఎంపిక చేసుకోవడం లేదా మార్చుకోవడం భారత రాజ్యాంగం ప్రకారం ప్రాథమిక హక్కని అలహాబాద్ హైకోర్టు కీలక తీర్పును వెలువరించింది. సమీర్ రావు అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు ఈ తీర్పు చెప్పింది. తన స్కూలు సర్టిఫికెట్స్‌లో తన పేరును షానవాజ్ నుంచి మొహమ్మద్ సమీర్ రావుగా మార్చాలని కోరుతూ ఆ వ్యక్తి పిటిషన్ దాఖలు చేశారు. తన అభ్యర్థనను తిరస్కరించడం ప్రాథమిక హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని పిటిషనర్ వాదించాడు. పేరు మార్చుకునే హక్కు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులలో ఒకటని శనివారం వెలువరించిన తీర్పులో కోర్టు పేర్కొంది. రాజ్యాంగంలోని 19(1)(ఎ) అధికరణ కింద వాక్ స్వాతంత్ర్యం, 21వ అధికరణ కింద వ్యక్తిగత స్వేచ్ఛ, 14వ అధికరణ కింద సమానత్వ హక్కు వంటివి ఇందులో ఉన్నాయని కోర్టు తెలిపింది. వ్యక్తి పేరు ఆ వ్యక్తి గుర్తింపులో కీలక భాగమని, పేరు మార్పు వ్యక్తిగత స్వేచ్ఛలో అంతర్భాగమని కోర్టు పేర్కొంది. స్కూలు రికార్డుల్లో తన పేరును మార్చడానికి ఉత్తరప్రదేశ్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ నిరాకరించడంతో సమీర్ రావు హైకోర్టును ఆశ్రయించారు. సర్టిఫికెట్ జారీ అయిన మూడేళ్లలోపల పేరు మార్పునకు అనుమతిస్తామని పేర్కొంటూ బోర్డు ఓ నిబంధనను ఉటంకించింది. అయితే ఈ నిబంధనను కోర్టు తోసిపుచ్చింది. ఇది ఏకపక్షంగా ఉందని, రాజ్యాంగం నిర్దేశించిన నిష్పాక్షికత, న్యాయం, సమానత్వం సూత్రాలకు భిన్నంగా ఉందని కోర్టు అభిప్రాయపడింది.

# బంగారు గనిలో పెను విషాదం

**– మాలిలో 48 మంది మృతి**



**బమాకో : (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పశ్చిమ ఆఫ్రికా దేశమైన మాలిలో ఘోర ప్రమాదం సంభ వించింది. పశ్చిమ మాలిలో శనివారం ఒక బంగారు గని కుప్పకూలడవంతో 48 మంది కార్మికులు మర ణించారు. పదుల సంఖ్యలో కార్మికులు గాయపడ్డారు. ఆదివారం కూడా ప్రమాద ప్రాంతం వద్ద సహాయక చర్యలు కొనసాగుతు న్నాయని అధికారులు తెలిపారు. పేద దేశమైన మాలి ప్రపంచంలో ప్రముఖ బంగారు ఉత్పత్తి దేశాల్లో ఒకటిగా ఉంది. ఇక్కడ ముడి బంగారాన్ని వెలికి తీసి ఇతర దేశాలకు తరలిస్తుంటారు. అయితే ఇక్కడ గనులను అక్రమంగానూ లేదా ప్రైవేటు వ్యక్తులు నిర్వహిస్తుంటారు. ఈ క్రమంలోనే మాలి బంగారు గనుల్లో ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకుంటాయి. శనివారం జరిగిన ప్రమాదం నెల రోజుల వ్యవధిలోనే రెండోది. శనివారం కొండచరియలు విరిగిపడ్డంతో ఈ ప్రమాదం జరిగినట్టు అధికారులు తెలిపారు. కొంత మంది కార్మికులు నీటిలో కొట్టుకుపోయారని వెల్లడించారు. గల్లంతైన వారి కోసం గాలింపు కొనసాగుతోందని చెప్పారు. కాగా, జనవరి 29న తూర్పు మాలిలో కౌలికోరో అనే ప్రాంతంలోని ఒక బంగారు గని కూలడంతో 12 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఎక్కువ మంది మహిళలే. అలాగే, గతేడాది జనవరిలోనూ మాలి రాజధాని బమాకో సమీపంలో జరిగిన దుర్ఘటనలో 70మందికి పైగా ప్రాణాలు కోల్పోవడం ప్రపంచవ్యాప్తంగా విషాదం రేపింది. మాలి జనాభాలో 2 మిలియన్ల (10శాతం) కన్నా ఎక్కువ మంది మైనింగ్ రంగంపైనే ఆధారపడి జీవిస్తుంటారు. ఎలాంటి రక్షణ ఏర్పాట్లు లేకుండా ప్రమాదకర పరిస్థితుల్లోనూ పనిచేస్తుంటారు.

# ఇంత జనాన్ని ఎప్పుడూ చూడలేదు

-వారిని అదుపు చేయడం సాధ్యపడలేదు
- ఢిల్లీ ప్రమాద ఘటనపై ప్రత్యక్ష సాక్షుల కథనం
- ప్రమాద కారణాలపై భిన్నాభిప్రాయాలు
-మా విన్నపాలు ఎవరూ వినలేదన్న అధికారులు



**న్యూఢిల్లీ (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
'మహా కుంభమేళాకు 12 మందిమి వెళుతున్నాం. అప్పటికి ఇంకా ప్లాట్‌ఫారం పైకి కూడా చేరుకోలేదు. మెట్ల వద్దే ఉన్నాము. నా సోదరి సహా కుటుంబ సభ్యులు జనంలో చిక్కుబడిపోయారు. అరగంట తర్వాత ఆమెను విగతజీవిగా చూడాల్సి వచ్చింది' అంటూ సంజరు అనే బాధితుడు కన్నీరుమున్నీరయ్యాడు. కుంభమేళాలో పుణ్య స్నానాలు ఆచరించేందుకు ప్రయాగరాజ్‌కు రైలులో వెళ్లాలని అనుకున్న వేలాది మంది భక్తుల్లో ఆయన కూడా ఒకరు. ఓ వైపు రైలు రాక ఆలస్యం కావడం, మరోవైపు జనరల్ టిక్కెట్ల అమ్మకం కొనసాగడంతో భారీగా చేరుకుంటున్న ప్రయాణికుల కారణంగా స్టేషన్‌లో సూది మొన మోపే స్థలం కూడా లేకుండా పోయింది. ప్రజలు భారీగా రావడం వల్లనే తొక్కిసలాట జరిగిందని, ఊపిరాడక అనేక మంది స్పృహ కోల్పోయారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.
అనేక సంవత్సరాలుగా ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో వ్యాపారం చేస్తున్న రవికుమార్ అనే వ్యక్తి మాట్లాడుతూ గతంలో ఇంత జనాన్ని ఎన్నడూ చూడలేదని అన్నారు. '12, 14, 15, 16 నెంబర్ ప్లాట్‌ఫారాల వద్ద ఇసుక వేస్తే రాలనంత జనం చేరారు. ప్రయాగరాజ్ వెళ్లే రైళ్లు అక్కడికే వస్తాయి. స్టేషన్‌లో ఉన్న బ్రిడ్జి చాలా చిన్నది. ప్రజలేమో అపరిమిత సంఖ్యలో వచ్చారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి పైన భారీగా జనం చేరారు. ఆ జన సందోహాన్ని ఎవరూ ఊహించలేదు. పండుగల సమయంలో కూడా అంతమంది రాలేదు. అధికారులు, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది ఉన్నప్పటికీ ప్రజలను అదుపు చేయడం సాధ్యం కాలేదు' అని వివరించారు. తొక్కిసలాట సమయంలో అక్కడే ఉన్న ఓ పోర్టర్ మాట్లాడుతూ రాత్రి 8.30 గంటల నుండే జనం రావడం మొదలైందని అన్నారు. మృతుల్లో మహిళలు, చిన్నారులు కూడా ఉన్నారని చెప్పారు.
1981 నుండి అదే స్టేషన్‌లో పనిచేస్తున్న మరో పోర్టర్ మాట్లాడుతూ 'గతంలో ఇంత జనాన్ని ఎన్నడూ చూడలేదు. ప్రయాగరాజ్ వెళ్లాల్సిన ప్రత్యేక రైలు 12వ నెంబర్ ప్లాట్‌ఫారం నుండి బయలుదేరాల్సి ఉంది. అయితే దానిని 16వ నెంబర్ ప్లాట్‌ఫారంకు మార్చారు. దీంతో ప్రయాణికులంతా 16వ నెంబర్ ప్లాట్‌ఫారం వద్దకు చేరుకునేందుకు పరుగులు తీశారు.